సాక్షి
కాకినాడ

ఆదివారం । 26 । మార్చి । 2023



భక్తుల వితరణ

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ అమ్మవారికి దండుపాటి ఆశోక్‌కుమార్, చప్పిడి శ్రీనివాస్ కుటుంబసభ్యులు శనివారం వెండి పళ్లెం, చెంబును బహూకరించారు.




అన్నదానానికి విరాళం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో నిత్యాన్నదానానికి వల్లూరి వీరభద్రరావు (విరవ) శనివారం రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1850, మధ్య డెల్టాకు 1200, పశ్చిమ డెల్టాకు 3200 క్యూసెక్కుల నీటిని వదిలారు.



అమ్మవారి జాతర..
ఆచారాల పరంపర

- గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభం
- వైవిధ్య ఆచారాలకు ఈ వేడుకలు పెట్టింది పేరు
- తీర ప్రాంత గ్రామాల్లో రెట్టించిన ఉత్సాహం

సండే స్పెషల్

పిఠాపురం: మార్చి వచ్చిందంటే అమ్మ వారి వేడుకలు మొదలవుతాయి. ఉగాది ముందు రోజును కొత్త అమావాస్యగా వ్యవహరిస్తారు. ఈరోజున ఎక్కువ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కొన్ని గ్రామాల్లో అమావాస్యకు ముందే ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఒక్కోచోట ఒక్కో సంప్రదాయం ఉంటుంది. ఆచారాలు కఠినంగా ఉన్నా తప్పకుండా అనుసరిస్తూ అమ్మవారిని కొలుస్తుంటారు. ఏటా ఒకసారి నిర్వహించే జాతర కోసం చిన్నాపెద్దా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. వివిధ విచిత్ర సంప్రదాయాలు కనిపించే అమ్మవారి ఉత్సవాలు జిల్లాలో ప్రస్తుతం జోరందుకున్నాయి.

తీరంలో వైవిధ్యభరితంగా ఆలయాలు

తీర ప్రాంత గ్రామాల్లో ఆలయాలు, దేవతల విగ్రహాలు ఆసక్తి కలిగిస్తాయి. ఆలయాలుంటాయి గాని నిత్యం ధూపదీప నైవేద్యాలు ఉండవు. కానీ అమ్మవారి ప్రతిమలు ఉంటాయి. ఆలయాలకు తలుపులు, చుట్టూ ప్రహరీలు ఉంటాయి. సాధారణంగా ఏ విగ్రహానికైనా రూపురేఖలు ఉంటాయి. ఇక్కడ అవేమీ కనిపించవు. మత్స్యకారులు మనసులోనే అమ్మను తలచుకుంటూ జీవనోపాధికి వెళుతుంటారు. తీరంలో అమ్మవారి జాతర్ల తీరు వైవిధ్యంగా జరుగుతాయి. ఆచారాలు కట్టుబాట్లు విస్మయం కనిపిస్తాయి. సాధారణంగా మత్స్యకారులు అమ్మవార్లను నేరేళ్లమ్మ, భాగిర్తమ్మ, బంగారమ్మ, గంగమ్మ, కాశిమ్మ, పోలేరమ్మ, చినతల్లి, పెదతల్లి పేర్లతో పిలుచుకుంటారు. ఇతర ప్రాంతాల్లో ముత్యాలమ్మ, నక్కుళ్లమ్మ, సత్తెమ్మ, బోడ కొండమ్మ, నూకాలమ్మ, మరిడమ్మ, మావుళ్లమ్మ తదితర పేర్లతో పిలుస్తుంటారు.



దున్నపోతుతో తొక్కించుకోడానికి ఉపవాసాలు ఉండి నేలపై పడుకున్న భక్తులు

దుష్టశక్తులు రాకుండా కర్రలతో కాపలా..

ఉప్పాడ శివారు కొత్తపట్నంలో గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతర ఇతర గ్రామాల్లో వేడుకలకు ప్రారంభ సూచకంగా నిర్వహిస్తారు. ఈ అమ్మవారి జాతర నిర్వహించాకే ఇతర గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు జరుపుతారు. ఈ జాతరలో అమ్మవారికి నైవేద్యం సమర్పించే సమయాన ఊళ్లో యువకులందరూ కర్రలతో కాపలా కాస్తారు. దుష్ట శక్తులు రాకుండా కర్రలతో కొడుతూ నైవేద్యం సమర్పించడం పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచారం. అమీనాబాదలో పోలేరమ్మ జాతరలో దున్నపోతును జాతరకు కొన్ని నెలల ముందు నుంచి పెంచుతారు. దానికి ప్రత్యేక పూజల చేస్తారు. జాతర రోజు భక్తుల దానితో తొక్కించుకుంటారు.ఇలా పలు ఆచారాలు ఆసక్తి కలిగిస్తాయి.

ఏడాదిలో ఒకటే పండుగ



ఏడాదికి ఒకసారి అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిస్తాం. కఠినమైన నియమనిష్టలతో ఉపవాసాలు ఉంటాం. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తాం. అగ్నిగుండాలు తొక్కడం వంటి కార్యక్రమాలు జరుపుతాం. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా ఆలయాలను అందంగా అలంకరిస్తాం.

– వనమాడి జగన్నాథం, కొత్తపట్నం, ఉప్పాడ

చాన్నాళ్లుగా వస్తున్న ఆచారం



తాతల కాలం నుంచి గ్రామ దేవత పండగలో దున్న పోతుతో తొక్కించుకోవడం ఆచారంగా వస్తోంది. చాలా నిష్ఠగా చేస్తాం. గ్రామంలో అమ్మోరులుగా కొందరు మహిళలు ఉంటారు. మా వాళ్లంతా తమ మీద దున్న పోతును నడిపించుకుంటారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో దోషాలు పోతాయని మా విశ్వాసం.

నక్కా మణికంఠ,(చినబాబు) సర్పంచ్, అమీనాబాద్, కొత్తపల్లి మండలం



తీర ప్రాంతంలో విచిత్రంగా ఉండే మత్స్యకారుల దేవతల ఆలయాలు



ఉప్పాడ శివారు కొత్తపట్నంలో అమ్మవారి నైవేద్యం సమర్పించే టప్పుడు దుష్ట శక్తులు రాకుండా కర్రలతో కొడుతు కాపాలా కాస్తున్న యువకులు

సమాజాభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర

జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ



సదస్సు సావనీర్ అవిష్కరిస్తున్న రెక్టార్ కే.వీ.రమణ, రిజిస్ట్రార్ సుమలత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమాజ అభివృద్ధిలో శాస్త్ర సాంకేతికత పాత్ర ఎంతో కీలకమైనదని జేఎన్‌టీయూకే రెక్టార్ కే.వీ.రమణ పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక విద్యను అభ్యసించే యువ ఇంజినీర్లు పరిశోధనలు చేసి దేశ ప్రతిష్ట పెంచాలన్నారు. జేఎన్‌టీయూకేలో సివిల్, సీఎస్ఈ, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ 23–23 శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కొత్త అవిష్కరణలు, వినూత్న పరిశోధనలు, స్టార్టప్‌లకు ఈ టెక్‌ఫెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు,పరిశోధక విద్యార్థులు సాంకేతిక విజ్ఞానం మెరుగుపరుచుకోడానికి టెక్‌ఫెస్ట్ వేదికగా నిలుస్తుందన్నారు. పరిశోధక విద్యార్థులు సాంకేతిక విజ్ఞానం మెరుగుపరుచుకుని సమాజానికి ఉపయోగపడే అవిష్కరణలకు నాంది పలకాలన్నారు. రిజిస్ట్రార్ సుమలత మాట్లాడుతూ జాతీయ స్థాయి సింపోజియంలో పాల్గొని మేధావులతో మేధోమధనం చేసి ఉన్నత స్థాయికి ఎదగవచ్చునని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ హెచ్‌ఎం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌ల ద్వారా నేర్చుకున్న ఆధునిక సాంకేతికతను తోటి స్నేహితులకు అందించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగి కలలు సాకరం చేసుకోవాలని ఆకాంక్షించారు. టెక్‌ఫెస్ట్‌లో భాగంగా పోస్టర్,పేపర్ ప్రజెంటేషన్,క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ కోటేశ్వరరావు, సీఎస్ఈ హెడ్ శ్రీనివాసరావు, కృష్ణ భాస్కర్, పెట్రోలియం కోర్సు అడ్వయిజర్ కేవీ రావు, కో–ఆర్డినేటర్లు డాక్టర్ కరుణ,సురేఖ,షమీం భాను,సూర్యరమఅధ్యాపకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఏలేరులో 78.75 మీటర్ల నీటినిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వ

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో శనివారం నాటికి నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు గాను 78.78 మీటర్లు, 24.11 టీఎంసీలకు 12.05 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ఈఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరిగాయి. దిగువ ఆయకట్టుకు 600, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటినిల్వలు ఎక్కువగా ఉన్నందున వచ్చే వేసవికి దిగువ ప్రాంతానికి తాగునీరు, ఆయకట్టుకు సాగునీటి సమస్య తీరనుంది.

రత్నగిరికి భక్తుల తాకిడి



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేసినట్టు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

9 నుంచి తలుపులమ్మతల్లి పుట్టింటి సంబరాలు



తలుపులమ్మ జాతరోత్సవాలపై చర్చిస్తున్న ఈఓ విశ్వనాథరాజు, చైర్మన్ అచ్చియ్యనాయుడు

తుని రూరల్: వచ్చే నెల 9 నుంచి 20వ తేదీ వరకు తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు నిర్వహించాలని లోవదేవస్థానం పాలక మండలి నిర్ణయించింది. లోవ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన శనివారం ధర్మకర్తలు, అధికారులు, లోవ కొత్తూరు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ధర్మకర్తలు, గ్రామస్తు ల సూచనలు, సలహాల మేరకు 12 రోజులు పాటు ఘనంగా అమ్మవారి పుట్టింటి జాతరోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రతి సంవత్సరం లోవ కొత్తూరు గ్రా మంలోని నాలుగు ఎకరాల దేవస్థానం భూమిలో అమ్మవారి పుట్టింటి సంబరాలు, లోవ దేవస్థానంలో నెల రోజులు ఆషాఢమాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

నేరస్తులపై నిఘా ఉంచండి

నేర సమీక్ష సమావేశంలో అధికారులకు ఎస్పీ సూచన



నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: అలవాటుగా నేరాలు చేసే వారితో సహా పాత నేరస్తుల కదలికలపై తగిన నిఘా ఉంచాలని ఎస్పి రవీంద్రనాథ్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. పలువురిపై షిస్టరీ షీట్లు తెరివాలని సూచించారు. శనివారం కాకినాడలోని ఎస్పి కార్యాలయంలో నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలు, యువతులు, బాలికలకు సహాయం చేసేందుకు మహిళా సిబ్బందిని మాత్రమే పోలీస్‌స్టేషన్లలోని రిసెప్షన్లలో నియమించాలన్నారు. ప్రజలకు లోన్ యాప్‌లపై అప్రమత్తం చేస్తూ, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందకు అమలు చేసే ప్రతి కార్యక్రమం విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ, మహిళలు, మైనర్లపై నేరాలను త్వరిత గతిన పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. దొంగతనాల నిరోధానికి రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలని సూచించారు. వ్యాపార సముదాయాల్లో తప్పకుండా సీసీ కెమేరాలు ఏర్పాటయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు సేవల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన మహిళా సిబ్బందికి ఎస్పి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి శ్రీనివాస్ సహా డీఎస్పిలు అంబికా ప్రసాద్, మురళీకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గది కావాలంటే బయోమెట్రిక్ వేయాలి

అన్నవరం దేవస్థానంలో కొత్త పద్ధతి

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సత్రాల్లో గదులు అద్దెకిచ్చే ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా ఈఓ చంద్రశేఖర్ అజాద్ చర్యలు తీసుకున్నారు. ఇకపై రత్నగిరిపై బస చేసే భక్తులు గదిలో దిగేటప్పుడు, గదిని ఖాళీ చేసేటపుడు (చెకిన్, చెకౌట్ సమయంలో) తప్పని సరిగా 'బయోమెట్రిక్ ' వేయాలి. శనివారం రాత్రి నుంచే ఈ పద్ధతిని అమలులోకి తెచ్చారు. ఒకరు గది అద్దెకు తీసుకుని బయోమెట్రిక్ వేసి మరొకరు గది ఖాళీ చేసేటప్పుడు బయోమెట్రిక్ వేస్తే సిస్టమ్‌లో నమోదు కాదు. దీంతో తప్పకుండా చెకిన్, చెకౌట్ సమయంలో ఒక్కరే బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. ఇలా గడువు లోపల జరగకపోతే మరో రోజు అద్దెకిచ్చినట్టు సిస్టమ్‌లో నమోదవుతుంది. గతంలో సత్రం గదిలో దిగిన వారు గడువు కన్నా ముందు ఖాళీ చేస్తే ఆ గది వేరొకరికి అనధికారికంగా ఇచ్చి ఆ అద్దెను సిబ్బంది తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని గది ఖాళీ అయిన విషయం ఈ బయోమెట్రిక్ ద్వారా తెలిసిపోతుందని అధికారులు తెలిపారు. ఈ విధానంతో దేవస్థానం ఆదాయం పెరగడంతో పాటు భక్తులకు గదుల లభ్యత కూడా పెరిగే అవకాశం ఉంది.



గది చెకౌట్ సమయంలో బయోమెట్రిక్ వేస్తున్న భక్తుడు

ఐసీసీసీ కార్యకలాపాలు
పునరుద్ధరణ

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) కార్యకలాపాల పునరుద్ధరణ, నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కోర్టు హాల్‌లో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (కెఎస్‌సీసీఎల్) డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడారు. విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీసీటీవీల ద్వారా నిఘా, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ వంటి ముఖ్యమైన కార్యకలాపాలు కమాండ్, కంట్రోల్ సెంటర్ ద్వారా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందించాలన్నారు. ఇందుకు అయిదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టిన సైన్స్ సెంటర్, కళాక్షేత్రం, స్కేటింగ్ రింగ్ పనులపైనా సమావేశంలో చర్చించారు. వీలైనంత త్వరగా వీటిని ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కేఎస్‌సీసీఎల్ సీఈవో, ఎండీ కె రమేష్, స్వతంత్ర డైరెక్టర్లు టీవీఎస్ కృష్ణకుమార్, డాక్టర్ జీవీఆర్ మూర్తి, డైరెక్టర్ సందీప్ కుల్హారియా తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ 37వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

మహిళల ఆర్థిక స్వాతంత్ర్యానికి సంక్షేమ పథకాలు

వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత విడుదల కార్యక్రమంలో ఎంపీ వంగా గీత



స్వయంశక్తి సంఘాల మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగాగీత, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఎన్నికల ముందు అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారని ఎంపీ వంగా గీత అన్నారు. ఈ పథకం మూడో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో ప్రారంభించారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుంచి ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి అమ్మాజీ, అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎ రాజేశ్వరి, కుడా చైర్‌పర్సర్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులతో కలసి ఆమె పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. మంచి మార్పు అనేది మహిళలతోనే మొదలవుతుందన్నారు. అందుకే మంచి నిర్ణయం తీసుకోవడంలో మహిళలు కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వం వైఎస్సార్‌చేయూత వైఎస్సార్ ఆసరా వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. కులం, మతం , రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రాతిపదికగా పథకాలు అందజేస్తున్నారన్నారు.

మూడో విడతలో రూ. 303.96 కోట్లు లబ్ధి: కలెక్టర్ కృతికా శుక్లా

మూడో విడత ఆసరా కింద జిల్లాలో 37,525 పొదుపు సంఘాల గ్రూపుల మహిళలకు రూ 303.96 కోట్ల మేర లబ్ధి జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి విడతలో రూ.283.45 కోట్లు, రెండో విడతలో 314.80 కోట్ల లబ్ధి చేకూరినట్లు వివరించారు. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, మెప్మా పీడీ బి ప్రియంవద, యుకొత్తపల్లి జెడ్పీటీసీ జి తులసీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీ స్వయంశక్తి సంఘాలకు చేకూరిన లబ్ధి (రూ. కోట్లలో)

నియోజకవర్గం	సంఘాలు	లబ్ధి మొత్తం
జగ్గంపేట	4818	41.79
కాకినాడ రూరల్	4421	37.40
కాకినాడ సిటీ	4063	28.08
పెద్దాపురం	4795	38.18
పిఠాపురం	5300	42.00
ప్రత్తిపాడు	4635	35.98
తుని	5059	42.04
పెదపూడి (అనపర్తి)	1444	14.72
తాళ్లరేవు (ముమ్మిడివరం)	1485	11.24
కాజులూరు (రామచంద్రపురం)	1505	12.53

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - సహకార శాఖ

స్థిరాస్తుల బహిరంగ వేలము ప్రకటన

(ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టం-7, 1964 రూలు 52 అనుసరించి)

దిగువ చూపబడిన వివరముల ప్రకారము ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వారికి రిజిస్ట్రీ తనఖా ఉంచబడి, బకాయిపడిన బాకీలు వసూలు నిమిత్తము శ్రీ సహకార సంఘముల డిప్యూటీ రిజిస్ట్రారు, కాకినాడ వారి ఆదేశానుసారం ఈ క్రింది నమోదు చేసిన స్థిరాస్తులు బహిరంగ వేలములో అమ్మబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

నెం.	సర్వశ్రీ ఖాతాదారుని పేరు మరియు సి.పి.ఇ.నెం.	వేలం తేది. సమయం	వేలం వేయు ప్రదేశము	తనఖా ఆస్తి వివరములు
1.	శ్రీ గుత్తుల రమణబాబు తండ్రి : చిన్నారావు సిఇపి నెం.102/2017-18.	10-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ, గోదారిగుంటలో డి.నెం.70-15-26 గల 150 చ॥గ॥లలో నిర్మించబడిన ఆర్‌సిసి బిల్డింగ్
2.	శ్రీ శీరం లక్ష్మీనారాయణ, తండ్రి : లక్ష్మణ మూర్తి సిఇపి నెం.24/2020-21	11-04-2023 ఉ॥ 11 గం.లకు	ఎమ్ డి ఓ కార్యాలయం పిఠాపురం	పిఠాపురం, మంగాయమ్మరావు పేట, డి.నెం.3-2-27/సి గల 164 చ॥గ॥లలో నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ భవనం.
3.	1. శ్రీ కొమర భవాని శంకర్, తండ్రి : సోమరాజు, 2. శ్రీమతి కొమర లక్ష్మీ వెంకటేశ్వరి, భర్త : భవాని శంకర్ సిఇపి నెం.227/2016-17	12-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ, జగన్నాయక్‌పూర్, గోగుదానయ్యపేట, డి.నెం. 58-16-43/ఎ గల 132 చ.గ.లలో నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ భవనం.
4.	శ్రీ కాశీలేటి రవీంద్ర, తండ్రి : భాస్కరరావు సిఇపి నెం.43/2017-18	13-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ, రేచర్లపేట, బర్మా కాలనీ, డి.నెం.3-16ఎ-31 గల 114 చ॥గ॥లలో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ బిల్డింగ్.
5.	1. శ్రీమతి మణుగుల కనకలక్ష్మి భర్త : (లేటు) మణుగుల మల్లేశ్వరరావు, 2. శ్రీ మణుగుల నరసింహారావు, తండ్రి : (లేటు) మల్లేశ్వరరావు, 3. శ్రీమతి మామిడాల సూకరత్నం, భర్త : సత్యనారాయణ, సిఇపి నెం.53/2017-18	15-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ రూరల్ మండలం, సర్పవరం, ఫ్లవర్ మార్కెట్ దగ్గర, మెయిన్ రోడ్ లో 460 చ॥గ॥లలో నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ ఐస్ ఫ్యాక్టరీ బిల్డింగ్ (ప్రస్తుతం మూసివేయబడినది).
6.	శ్రీ వల్లూరి వీరభద్రరావు, తండ్రి : వెంకటచలం, శ్రీ వల్లూరి శ్రీనివాసరావు, తండ్రి : వెంకట చలం, శ్రీ వల్లూరి సన్యాసిరావు చౌదరి, తండ్రి : వెంకటరాజు సిఇపి నెం.33/2019-20	17-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ, గాంధీ నగర్, పాలవారి వీధి లో 449 చ॥గ॥లలో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు గల భవనములో 4 భాగములలో 3 భాగములు అనగా గ్రౌండ్ ఫ్లోర్ లోని ఒక భాగం మరియు మొదటి అంతస్తు నందలి 2 భాగములు
7.	శ్రీ ఆరిమిల్లి బుల్లిరాజు, తండ్రి : రాములు సిఇపి నెం.11/2019-20	19-04-2023 ఉ॥ 11 గం.లకు	జి మేడపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం	సామర్లకోట మండలం, జి మేడపాడు పంచాయితీ, జి మేడపాడు గ్రామం, డి.నెం.6-123, సర్వే నెం.595/6 నందు 315 చ॥గ॥లలో నిర్మించిన టైల్డ్ హౌస్ మరియు సర్వే నెం.596/6 నందు 50 సెంట్లు పంట భూమి.
8.	శ్రీ రాజారపు వెంకట భాస్కర నారాయణ మూర్తి, తండ్రి : వెంకట గోపాలరావు, 2. శ్రీమతి రాజారపు సత్యమతి, భర్త : ఆర్‌వివి నారాయణ మూర్తి, 3. శ్రీమతి వెలుగుల వెంకట సత్య రాఘ లావణ్య, భర్త : హేమ్ కుమార్, సిఇపి నెం.41/2015-16	20-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ, నరసన్న నగర్ నందు పద్మావతి రెసిడెన్సీలోని ఫ్లాటు నెం.జి1 మరియు రమణయ్యపేట గ్రామం నందలి సేలరీడ్ ఎంప్లాయిస్ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటి తాలుకు బృందావన్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాటు నెం.514.
9.	శ్రీమతి మసిముక్కల రామలక్ష్మి, భర్త : వీర వెంకటేశ్వరరావు, సిఇపి నెం.61/2022-23	21-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ మున్సిపల్ ఏరియా, రమణయ్యపేట, క్యాన్సర్ హాస్పటల్ దగ్గర లో గల 313 చ॥గ॥ల విస్తీర్ణం ఖాళీ స్థలం.
10.	శ్రీ కోడి శంకర్, తండ్రి : సత్యనారాయణ సిఇపి నెం.32/2015-16	24-04-2023 ఉ॥ 11 గం.లకు	మూలపేట గ్రామ పంచాయితీ	కొత్తపల్లి మండలం, మూలపేట వద్ద సర్వే నెం.19/2బి, 19/2సి తాలూకు 8 ఎకరాల 93 సెంట్లు భూమి.
11.	శ్రీమతి కోసూరి చక్రలక్ష్మి, భర్త : లేటు కెవి పాండు రంగారావు, సిఇపి నెం.75/2022-23	25-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	అచ్చంపేట గ్రామ పంచాయితీ, కొప్పవరం గ్రామం వద్ద 170.60 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం.
12.	శ్రీమతి యల్లబోయిన లక్ష్మి, భర్త : సత్యనారాయణ సిఇపి నెం.234/16-17	27-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	కాకినాడ, తూరంగి గ్రామ పంచాయితీ, జయ ప్రకాశ్ నగర్ నందు 204.61 చ॥గ॥లలో నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్.
13.	1. శ్రీమతి యార్లగడ్డ రాణి చంద్ర, భర్త : విజయ గోపాల కృష్ణ, 2. శ్రీ యార్లగడ్డ గోపాల కృష్ణ, తండ్రి : బంగార్రాజు, సిఇపి నెం.42/2020-21	29-04-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	సామర్లకోట, జగ్గమ్మ గారి పేట వద్ద డిటిసిపి లేఅవుట్ ఆమోదిత డి.టిప్.నెం.1974/2014/ఆర్1, తేది.19-2-15 ప్రకారం 17 ప్లాట్స్ (ఖాళీ స్థలాలు).
14.	శ్రీ బొంగా చంద్ర శేఖర్ రెడ్డి, తండ్రి : ఈశ్వర్ రెడ్డి, సిఇపి నెం.72/2022-23	03-05-2023 ఉ॥ 11 గం.లకు	ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద, సూర్యారావుపేట, రామయ్య వీధి, కాకినాడ	రమణయ్యపేట గ్రామం, ఎన్‌ఎఫ్‌సిఎల్ పైప్ లైన్ రోడ్ ప్రక్కన, ఎల్ పి నెం.22/2014 నందు 693 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం.

గమనిక : ఆస్తి వేలం పాట తాలూకు సొమ్ము పాట మొత్తంలో 15% అదే రోజు కట్టవలెను. 2 లక్షలు మించి కట్టవలెనన్న పాట అయిన వెంటనే బ్యాంక్ ద్వారా పాటదారు బ్యాంక్ ఖాతా నుండి సొసైటీ బ్యాంక్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయవలసి ఉన్నది. సొసైటీ బ్యాంకు ఖాతాల వివరములు ఆఫీసు నందు పొందవలెను.

ఇతర వివరముల కొరకు కార్యాలయం పనిచేయు దినములలో పనివేళల యందు సేల్ ఆఫీసర్ లేదా ఇన్‌ఛార్జి (రికవరీ) సెల్ నెం. 93948 45965, ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ, డో.నెం.13-4-13, రామయ్య వీధి, సూర్యారావుపేట, కాకినాడ వారిని సంప్రదించవచ్చును.

డి.25-03-2023
కాకినాడ

సం/-జి.ఎల్.వి.పి.సూకరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ / సేల్ ఆఫీసర్, సెల్ : 8639297322
ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ (లి), రి.నెం.8979, సూర్యారావుపేట, కాకినాడ

ఇక నుంచి రెగ్యులర్

- అన్నవరం దేవస్థానానికి పూర్తిస్థాయి ఈఓగా చంద్రశేఖర్ అజాద్
- దేవదాయ శాఖ ఎస్టేట్ అధికారిగా సత్యనారాయణమూర్తి


నూతన ఈఓ చంద్ర శేఖర్ అజాద్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా ఎస్ఎస్ చంద్ర శేఖర్ అజాద్ పూర్తి స్థాయిలో నియమితులయ్యారు. దేవదాయ శాఖలో ఎస్టేట్ అధికారిగా ఉన్న ఆయన ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఈఓగా సేవలందించారు. ఇప్పటి వరకూ ఇక్కడ రెగ్యులర్ ఈఓగా పని చేస్తూ, వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లిన ఎన్వీ సత్యనారాయణమూర్తిని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎస్టేట్ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ ఆదేశాలు జారీ చేశారు. ఇవి శనివారం ఉదయం దేవస్థానానికి చేరాయి. దేవస్థానంలో భక్తులకు మరిన్ని సేవలు అందించేందుకు గాను అజాద్‌ను ఇక్కడ నియమించినట్టు కమిషనర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

పరిపాలనను చక్కదిద్దేందుకే..

అన్నవరం దేవస్థానంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయనే అభియోగంపై గత ఏడాది డిసెంబర్ 18వ తేదీన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ రత్నగిరిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం దేవస్థానంలో పరిపాలన అంత సజావుగా లేదని భావించి, కొన్ని ఆదేశాలిచ్చారు. మార్చి రెండో తేదీన గ్లోబల్ ఇండస్ట్రియల్ సమ్మిట్‌కు విశాఖపట్నం వెళ్తూ, సత్యదేవుడిని మంత్రి సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆ సందర్భంగా గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై అధికారులను ప్రశ్నించారు. అయితే, దేవస్థానం పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. అదే సమయంలో ఈఓ సత్యనారాయణమూర్తి 15 రోజులు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో అజాద్‌ను ఇన్‌చార్జిగా కమిషనర్ నియమించారు. భక్తుల సౌకర్యాల విషయంలో గడచిన మూడు వారాలుగా ఆయన ఎటువంటి రాజీ పడకుండా వ్యవహరించారు. పలు విభాగాలను స్వయంగా తనిఖీ చేసి, సిబ్బందిని పరుగులు పెట్టించారు. స్వయంగా గుర్తించిన వాటితో పాటు, మీడియాలో ముఖ్యంగా 'సాక్షి' పత్రిక వెలుగులోకి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంపై గడువు విధించి, తప్పనిసరిగా మార్పు కనిపించాలని ఆదేశించారు. అంతేకాదు.. చెప్పిన పని జరిగిందో లేదో పరిశీలించారు. ఏ పని ఎంతవరకూ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో పాటు, భక్తులు కూడా సంప్రదాయ దుస్తులు ధరించాలని, బొట్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఇటువంటి వరుస పరిణామాల నేపథ్యంలో అజాద్‌నే ఇక్కడ పూర్తి స్థాయి ఈఓగా నియమించారు. వచ్చే నెల 30 నుంచి మే ఆరో తేదీ వరకూ సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాలు, జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ నిర్మాణం వంటివి ఆయన హయాంలోనే జరిగే అవకాశాలున్నాయి.



టీడీపీది బలం కాదు.. వాపు

- సీఎం జగన్ సంక్షేమ రథసారథి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

మండపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొడ్డిదారిన వచ్చిన విజయాన్ని చూసి టీడీపీ నాయకులు బలమనుకుని ఎగిరెగిరి పడుతున్నారని, అది బలం కాదు వాపు అన్న నగ్న సత్యాన్ని వారు గుర్తుంచుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో శనివారం మత్స్యకార కమ్యూనిటీ హాలు శంకుస్థాపనలో ఆయన, ఎంపీ చింతా అనురాధ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన, సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మోపిదేవి మాట్లాడారు. రాజకీయ వ్యవస్థను చంద్రబాబు నాయుడు భ్రష్టు పట్టించారని, రాజకీయాల్లో ధన ప్రవాహాన్ని తీసుకువచ్చి, వ్యవస్థలను నాశనం చేశారని దుయ్యబట్టారు. దొడ్డిదారిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, ఎమ్మెల్సీని గెలిపించుకోవడం సిగ్గు చేటని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథసారథిగా పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. వ్యవస్థలోని లోపాలను సరి చేస్తూ ప్రజావసరాలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నారని మోపిదేవి గుర్తు చేశారు.

అమలాపురం ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమానికీ సీఎం జగన్ చేస్తున్న కృషి సమాజంలో ఆర్థిక, సామాజిక సమతుల్యత తీసుకు వస్తోందని అన్నారు. తద్వారా బడుగు బలహీన వర్గాల వారు అభ్యున్నతి సాధించగలుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తొలుత శ్రీరామగంగా ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యాన ఎంపీలు మోపిదేవి, అనురాధ, ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి భవాని, నల్లమిల్లి మంగతాయారు, పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నౌడు వెంకట రమణ, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి, చిత్రంలో ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఫుడ్ టెక్నాలజీ కోర్సుకు జాతీయ గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ-కాకినాడ అందిస్తున్న ఫుడ్ టెక్నాలజీ కోర్సుకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ల్యాబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) గుర్తింపు వచ్చింది. జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ ఆధ్వర్యాన తన కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఎన్.హేమచంద్రారెడ్డి శనివారం ఈ విషయం ప్రకటించారు. రాష్ట్రంలో ఈ ఒక్క వర్సిటీకే ఈ గుర్తింపు రావడం సంతోషకరమని అన్నారు. జాతీయ స్థాయి అక్రిడిటేషన్ గుర్తింపుతో పాటు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ కూడా రావడం సంతోషంగా ఉందని చెప్పారు. సాంకేతికంగా రాష్ట్రంలో అగ్రగామిగా ఉన్న జేఎన్‌టీయూకే మరో గుర్తింపు పొంది ఫుడ్ టెస్టింగ్‌కు వేదికగా నిలుస్తుందని అన్నారు. వీసీ డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఆహార పరిశ్రమలు, తయారీదారులు, వ్యాపారులకు తక్కువ ధరలకే నాణ్యమైన పరీక్షలు నిర్వహించి నాణ్యమైన ఆహారం తయారయ్యేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా కాకినాడ పోర్టులో దిగుమతి చేసుకున్న ఆహార నమూనాలను పరీక్షించడం ద్వారా ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. డాక్టర్ మాలోతు రమేష్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో ఎగుమతి తనిఖీ మండలి, అగ్రికల్చరల్ ప్రాసెస్ ఫుడ్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అక్రిడిటేషన్ సాధించేందుకు కూడా కృషి చేస్తున్నామని చెప్పారు.


ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పత్రం అందజేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి. చిత్రంలో వీసీ ప్రసాదరాజు, మాలోతు రమేష్

లారీ ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట: లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై విద్యాసాగర్ కథనం ప్రకారం.. ఏలేశ్వరం గ్రామానికి చెందిన మద్దిరాల శ్రీనివాసరావు, కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన బర్రె మాణిక్యం వరుసకు అన్నదమ్ములవుతారు. కాట్రావులపల్లిలో బంధువులను కలిసేందుకు వీరు శనివారం మోటార్ సైకిల్‌పై కలిసి బయలుదేరారు. జగ్గంపేట శివారు పెట్రోలు బంక్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొంది. ప్రమాదంలో బైకు నడుపుతున్న మద్దిరాల శ్రీనివాసరావు (47) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న మాణిక్యం కాలికి గాయమైంది. మాణిక్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ హయాంలో బీసీలకు అగ్రాసనం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య ప్రశంస


రాయుడు రాకేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయ్య. చిత్రంలో జక్కంపూడి రాజా తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం సిటీ): బీసీల పక్షాన నిలబడిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. 'హలో బీసీ.. చలో రాజమహేంద్రవరం' పేరిట స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎంతో మంది బీసీ విద్యార్థులు ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదిగారన్నారు. బీసీలు రాజకీయ రంగంలో కూడా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల 18 ఎమ్మెల్సీ సీట్లకు గాను ముఖ్యమంత్రి జగన్ బీసీలకు 11 కేటాయించారని, మంత్రివర్గంలో కూడా 11 మందికి స్థానం కల్పించారని గుర్తు చేశారు. అలాగే బీసీల అభివృద్ధికి రూ.38 వేల కోట్లు కేటాయించారన్నారు.

కేంద్రం పిసరంత బడ్జెట్

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లతో పాటు రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్లపై కేంద్రంతో పోరాడుతూనే ఉంటామని కృష్ణయ్య చెప్పారు. కేంద్రం బడ్జెట్‌లో బీసీలకు అతి తక్కువ కేటాయించిందన్నారు. రూ.2 లక్షల కోట్లు కేటాయించి, ప్రతి కుటుంబానికీ రూ.10 లక్షల సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. క్రీమీలేయర్ ఎత్తివేయాలని, హైకోర్టు, సుప్రీంకోర్టులో జడ్జి పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన రాయుడు రాకేష్(కాకా)కు ఆయన నియామక పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రాంతీయ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.